

# బుజ్జేం తప్పి పోలేదు !



మా స్కూలు బెల్లు నాలుగుకి కొడతారు కదా! పుస్తకాలు సద్దుకుని గేటు దగ్గిర కొచ్చే టప్పటికి ఈ పిచ్చి కారొకటి కప్పలా నోరు తెరుచుకుని వుంటుంది. దాంతో రెండే నిమిషాల్లో ఇంటికొచ్చే యాల్సొస్తోంది. గుంటూర్లో

అయితే ఎంత సరదాగా వుండేదో! అందరం ఓ చోట కలవడమే అరగంట పట్టేది. కనీసం గంటయినా నడుచుకుంటూ వచ్చేవాళ్ళం. బోల్డు కబుర్లు చెప్పుకునే వాళ్ళం.

ఏవిటో ఈ సువర్ణ! నేను వాగడమేగానీ ఒక్కటీ ఎదిరించదు, కాదనదు. అన్నిటికీ వూకొట్టడమే. మహా అయితే అలాగా అంటుంది. అదే చిన్నారయి తేనో! ఒక చిన్న మాట నిజమని చెప్పడానికి నాకు గంట పడుతుంది. అది కాస్తా పోయి ఇంకో బళ్ళో చేరి కూచుంది. స్కూలుకి కార్లో వెళ్ళడం కొత్తల్లో మహాగొప్పగా వుండేదిగానీ రాను రానూ విసుగొచ్చేస్తోంది బాబూ! కావాలంటే ఆఫీసులకి కార్లలో వెళ్ళాలి గానీ స్కూలుకేవిటి అసయ్యంగా! అసలు స్కూలంటేనే వెళ్ళడం రావడం కదా!

నాకు హోంవర్కు చేసేస్తే గానీ తోచదు. అదక్కడ బాకీపెట్టి ఆడుకోవాలన్నా సరదా-వుండదు. టిఫిను తినేయగానే గబగబా కిటికీలో పుస్తకాలు పెట్టి నిలబడే ఆ హోంవర్కు కాస్తా పూర్తి చేసేశాను. ఇంక రేపటి దాకాగొడవలేదు. ఆఫీసు గదిలోకి తొంగి చూస్తే మామయ్య గారు మహా బిజీగా వున్నారు. మద్రాసెడుతున్నార్టగదా రాత్రికి! గుమస్తా కుర్రాళ్ళంతా టకటకా కొడుతున్నారు. అటెళ్ళాలనిపించకనెమ్మదిగా వాళ్ళ వంటింట్లోకెళ్ళా - వెంకాయమ్మ గారేంచేస్తున్నారో చూద్దావని. అప్పటికే ఆవిడ అన్నం వార్చేసి గట్టుమీద పెట్టి ఒక్కొక్క బెండకాయే గుచ్చుతున్నారన్నంలో.

''అప్పుడే అన్నం అయిపోయిందా అమ్మమ్మగారూ! అదేవిటీ బెండ కాయలన్నంలో గుచ్చుతున్నారూ? జిగురొచ్చేయదూ అన్నం!'' అనడిగా.

''చూస్తు వుండు ఏం చేస్తానో'' అంటూ అయిదు నిమిషాలాగి ఆ బెండకాయలన్నీ బయటకి తీసి ముచికలు కోసేసి రోట్లో నూరిన పోపుతో కలిపి పచ్చడి చేసేశారు. మావయ్య గారికీ పచ్చడంటేచాలా ఇష్టంట. పాపం వూరెడుతున్నారు కదా! వారం రోజుల వరకూ సాంబారూ, చప్పిడి కూరలే కదాని ఈపూట ఇది చేయమన్నార్ట. ఏవిటో! నాన్నేమో బెండకాయలో జిగురుంటే తినరు. మామయ్యగారేమో జిగురు పోకూడదంటారు. ఎవరిష్టాలు వాళ్ళవి. నా కసలు పచ్చడంటేనే పెద్దసయించదు. అమ్మంటుందిగా పిల్లలు పచ్చడి తినకపోతే కొంపలేం అంటుకోవులే అని! సరే ఎప్పటికయినా పనికొస్తుంది బెండకాయ పచ్చడెలా చేస్తారో తెలిసి పోయింది కదా! ఇంక పార్కుకెళ్ళి తాడాట ఆడుకోవచ్చు అనుకుని ఇంట్లో తాడుకోసం వెదకటం మొదలుపెట్టా.

''అమ్మా నా తాడెక్కడ దాచేశావే! నే పార్కుకెళ్లి ఆడుకోవాలీ''

''తాడాటకూడా పార్కుకెళ్ళాలా? ఆ గెంతేదేదో ఇంట్లోనే గెంతుకోవచ్చుగా! ఇంట్లోకాల్నిలవదు. నీకాళ్ళకి చక్రాలుపెట్టిపుట్టించాడేమో దేవుడు!'' అంటూ గూట్లో ఫోటో

వెనకాల పెట్టిన తాడు తీసిచ్చింది.

''కనీసం ఈ ఆటకి ఎంత ముందుండాలో కూడా నీకు తెలియకుండానే పెద్దయ్యావా అమ్మా! ఇద్దరన్నా అటూ ఇటూ నిలబడి తిప్పాలా. నలుగురన్నా లేకపోతే ఆటేవిటి? వుత్తినే గెంతడవే అయితే దీన్ని తాడాట అని ఎందుకు పిలుస్తారు?''

''సర్లే! మాటకి మాట. చీకటడేలోపల వచ్చేయ్. అయినా నీకక్కడంతమందెలా ఫ్రెండ్సున్నారు?'' అమ్మ అడిగేసింది. విని నేనే వూరుకున్నప్పుడూ ఈ చిన్నారి దయ్యం నోరిప్పడం ఎందుకూ! ''పుష్పావతి ,చంద్రకళ, సావిత్రి అని దీనికి చాలా గొప్ప నేస్తాలున్నార్లే'' అని వెటకారంగా చెప్పింది.

''నువ్వేం మహా బడాయిలు పోయి వాళ్ళనేం ఎక్కిరిచ్చక్కర్లా! వాళ్ళు చదివేది నీబళ్ళోనే. కాపోతే వాళ్ళకి చదువంటే అంత ఇష్టం వుండదుట. వాళ్ళ నాన్నకి హాయిగా ఏలూరన్ని మూలలా కలిపి ఆరులాండ్రీ షాపులున్నాయి తెలుసా! పదిహేను మంది దాకా ఇస్త్రీ కుర్రాళ్ళే వున్నారాయన దగ్గిర! మనకేం వుంది వుత్తనే గొప్పలు పోవడమేగానీ ఒక్క లాండ్రీ షాపన్నా వుందా?''

''చిన్నారీ! దాన్ని పోనియ్యి ఎందుకూరికే వాగిస్తావు దాన్ని'' అని అమ్మ నన్ను చీపురు పుల్లలా తీసి పారేసింది. తీరా బయల్దేరబోతుంటే ఇందూ, బుజ్జీ వెంటపడ్డారు. ఆట మధ్యలో ఖంగారు పెట్టకూడదూ! నేవెడదాం అనే వరకూ గోల చెయ్యకూడదూ అంటే గంగిరెద్దుల్లా తలూపి మరీ తయారయ్యారు నాతో. మేం పార్కుకెళ్ళేటప్పటికే వాళ్ళందరూ తొక్కుడు బిళ్ళాడుకుంటున్నారు. అందరం తాడాటకి పంటలేసుకున్నాం. నేనొక్కసారి ఆడానో లేదో ఇందు పేచీమొదలుపెట్టింది ఇంటికెళ్ళిపోతానని. ఇప్పుడేగా వచ్చాం! కాసేపాగవే మహాతల్లీ అంటే వినిపించుకునేడిస్తేగా ! అయినా ఈ మధ్య బళ్ళో చేరినప్పట్నించీ బాగానే వెళ్ళొస్తోంది కదా రోడ్డు వారగా నడవడం వచ్చే వుంటుందిలే అనుకుని పోతేపోవే అన్నా. అది వెడతాననేటప్పటికి బుజ్జీ బయల్దేరింది. ఇంతొకెల్లి ఆలుకుంతానంటూ. జాగర్తగా వెళ్ళండని చెప్దామంటే నేనేమో ఆట మధ్యలో వున్నా కదా ! గెంతుతూ లెఖ్ఖే పెట్టుకుంటానా ! వాళ్ళకి జాగర్తలేచెప్తానా ! ఒకవేళ అవుటయ్యానంటే మళ్ళీ అయిదు గురి ఆట చూస్తూ కూచోవాలి.

కాస్సేపటికే తాడు సరిగ్గా కనిపించక వూరికేనే అవుటయిపోడంమొదలెట్టా. కొంపదీసి చీకటడిపోయిందేమోనని ఒక్క పరుగున ఇంటికిచేరా ! అప్పటికే అమ్మ వీపు మీద చిన్నారినీ, ఒళ్ళో ఇందునీ మోస్తూ కూడా మహా సంతోషంగా ఏదో కథ చెప్తోంది వాళ్ళిద్దరికీ. నన్ను చూడగానే ''వచ్చావా తల్లీ, కాళ్ళు కడుక్కురా. కథ మధ్యలో వుంది. ఇక్కడ్నించే విను. మళ్ళీ మొదలెట్టమంటే నా వల్లకాదు'' అని వీధి గుమ్మంకేసి చూసి ''బుజ్జేదే ? ఇంత దూరం తెచ్చిన

దానివి ఇంట్లోకి తేకూడదూ పాపం'' అంది.

''బుజ్జిని నేతేవడం ఏవిటి ? అదెప్పుడో ఇందుతో ఇంటికొచ్చేస్తే !'' అన్నా.

''నీ మొహంమండ! చంటిదాన్నేం చేశావే ? ఇందుతో రావడవేమిటీ ?'' అంటూ వాళ్ళిద్దర్నీ ఒక్క తోపుతో విదిలిచ్చుకుని గబుక్కున లేచి వీధికేసి పరిగెత్తింది.

''ఏవిటయిందే ఇందూ ? నీతో బుజ్జిని ఇంటి దాకా తేలేదా ?'' అంటే 'మేం ఇద్దరం నడుచుకుంటూ జాగర్తగా వస్తుంటే దారిలో చంద్రరావు కనిపించాడూ, అప్పుడది మళ్ళీ సుశీలతోనే వస్తానంటే నీ దగ్గిర దిగబెట్టేయమన్నా'' అని చల్లగా చెప్పింది. ఎలాగూ నాతో వస్తుంది కదాని ఈవిడా సంగతి అమ్మకి చెప్పనే లేదుట. ఇంక నేనూ, చిన్నారీ కలిసి దాన్ని వెతకడం మొదలెట్టాం. ముందు మా ఇల్లు, తాతగారి పూజగదీ, మావయ్యగారి బల్ల కిందా, వెంకాయమ్మ గారి మంచంకిందా, బట్టల స్టాండు వెనకాలా అంతా వెతికేశాం. నేనూ చిన్నారీ పార్కుకెళ్ళి అక్కడ కూడా వెతికొచ్చాం. అంతా చీకటే ! గుడ్డిలైట్లు.

''బుజ్జీ ! బుజ్జీ ! ఒక్కసారి ఏడమ్మా ! మాకు వినిపిస్తుందీ !'' అని కూడా అరిచాం. అయినా కనపళ్ళేదు. ఇంటికొచ్చేటప్పటికి గుమ్మంలో అత్తయ్యగారూ, బామ్మగారూ పని వాళ్ళూ అందరూ అమ్మ నూరుకోబెట్టడమే ! ఈవిడగారేదో కొంప మునిగిపోయినట్లొకటే ఏడుపు ! అమ్మకి ధైర్యంచెప్దామని ''ఎందుకమ్మా ! వస్తుందిలే ! ఎక్కడికి పోతుందీ ! దీనేడుపు ఎవరు భరించగలరు ! ఒకవేళ ఎవరన్నా ఎత్తికెళ్ళినా తిరిగి దిగబెట్టేస్తార్లే'' అన్నా.

''ఛ నోర్ముయ్ ! పీనుగుకానా ! అసలిదంతా నీ మూలంగానే కాదూ ! నీకు చదవేస్తేవున్న మతిపోతోంది. అతి వాగుడు. పో ! పోయి మళ్ళీ ఆ పార్కులోనే వెతికి తగలడు.''

అవున్లే ! దానికెవరు తెలుసని ఇంకెక్కడన్నా వెతికేందుకు. అదేనేగానీ అలా తప్పిపోతే ఎంచక్కా బోల్డు చోట్ల వెతకచ్చు.

మావయ్యగారి గుమాస్తా కుర్రాళ్ళు సైకిళ్ళెక్కి ఆ పేటలో నాలుగు వీధులూ ట్రింగ్ ట్రింగ్ మంటూ తిరిగొచ్చారు. ఆలోచించగా నాకే మళ్ళీ ఓ అనుమానం వచ్చి ''అమ్మా పార్కుకీ మనింటికీ మధ్య ఆరే ఇళ్ళు కదా ! ఒకవేళ మురిక్కాలవలో పడిపోయిందేమోనే'' అన్నా! ఇంక అమ్మ కూలబడిపోయి నన్ను తిట్టడం ఆపదే !

ఇంతట్లోకీ ఈ గొడవంతా విని మావయ్య గారు బయటికి వచ్చారు.

''పాపం ! సుశీలనేం అనకండి. తానూ చిన్న పిల్లే కదా. రోజూ తీసికెళ్ళి తీసుకు రావడం లేదూ ? మీరు ఖంగారు పడకండి. మీ వారికి కబురు చేస్తా'' నని అమ్మనించి నన్ను రక్షించారు.

ఇంతట్లోకే వెంకాయమ్మగారు అమ్మని బావి దగ్గిర కాళ్ళు కడుక్కు రమ్మని దేవుడి దగ్గిర ఓ రూపాయీ కాసిని బియ్యం బట్టలో వేసి ముడుపు కట్టించి, పిల్ల క్షేమంగా ఇంటికొస్తే

అందరం కొండ కొస్తామని దేవుడికి చెప్పించారు.

ఎంతైనా దేవుడు కదా ! మనం నమ్మితే మహత్యం ఎందుకుండదూ ! రెండు నిమిషాల్లోనే చంద్రావు సైకిలు దిగుతున్నాడు. ముందు చిన్న సీటు మీద కునికిపాట్లు పడుతూ బుజ్జి.

''సూసేసినాం ! సూసేసినాం ! ఏలూరోలు మొత్తం సూసేసినాం. రేపిందిరమ్మ గోరికి సూపించేత్తాం'' అని దాన్ని దింపి ఇంట్లోకి తెచ్చాడు. అమ్మ వెంటనే దాన్నెత్తుకుని ఇంకో గంటసేపేడ్చి వాడ్ని తిట్టడం మొదలెట్టింది. అమ్మయ్య ఇంక నా జోలికి రాదు.

'వెధవా ! ఎవర్నడిగి పిల్లని తీసికెళ్ళావురా ? ఇంటిల్లిపాదీవీ ఎంత ఖంగారు పడుతున్నాం? ఇదా నువ్వు చేసే నిర్వాకం. అయ్యగారితో చెప్తానుండు. చెప్పా పెట్టకుండా షికార్లా ?''

''అయ్ బాబోయ్ ! అలగంటారేంటండి బాబో ! ఎవ్వరికీ సెప్పకుండా నేనెందుకు తీసికెళ్తానండి ! ఇగో ! ఈ ఇందు పాపమ్మకి సెప్పానో లేదో కనుక్కోండి. కూసింత దూరం ఎల్లొచ్చే లోపట టైరు పంక్చరయి పోయింది. మీ పాపని నేనేం చేసుకుంటానండి. నాకు మాత్రం ఆడపిల్లలు లేరుగానీ పిల్లలే లేరేటండి!''

''నీతో వెళ్ళిందంటే మేమెందుకు ఖంగారు పడతాం ! ఏవే ఇందూ ఎందుకు చెప్పలేదే అతన్తో షికారెళ్ళిందని ?''

''మర్చిపోయానే!'' అంది చాలా స్టైలుగా. నాన్నొచ్చాక అమ్మ చెప్పిందంతా విని నన్ను పిలిచి పేద్ద నీతి పాఠం చెప్పారు.

''నానీ ! ఇకనించీ నువ్వెక్కడికెళ్ళినా ఎవర్నీ తీసికెళ్ళకు. ఎక్కడికెడుతున్నావో అమ్మకి చెప్పి వెళ్ళు - వస్తానన్న టయానికొచ్చేయి. నీ మూలంగా ఎందరి పన్లు పాడయ్యాయో చూడు! అమ్మ ఎంత ఖంగారు పడిందో పాపం.''

''మీకూ నేనే దొరికానా నాన్నా ! చంద్రగాడితో సైకిలెక్కించేసిన ఇందూ మంచిదే ! కులుక్కుంటూ వూరంతా షికార్లు కొట్టిన బుజ్జికేమో ముద్దులూ, గారాబాలూ ! నా పాటికి నే ఆడుకొచ్చిన పాపానికి నాకు తిట్లూ చీవాట్లూ ! ఇంక మీక్కూడా నాదే తప్పుగా అనిపిస్తే ఒక్కసారి తప్పిపోయి చూపిస్తా ! ఎక్కడెక్కడ వెదకాలో కూడా తెలియక గోల పెడతారందరూ మళ్ళీ!''